క్లుప్తంగా

ఆటోను ఢీ కొట్టిన బొలెరో వాహనం

● ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు



హస్లీ మృతదేహం

ములుగు రూరల్: కూలీలతో వెళ్తున్న ఆటోను బొలెరో వాహనం ఢీ కొట్టిన సంఘటన మండలంలోని జాకారం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాపురం మండలం ఇంచెన్ చెరువుపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు ఎనిమిది మంది పని ముగించుకొని ఆటోలో ములుగు నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో జాకారం సమీపంలోని జిన్నింగ్ మిల్లుకు చేరుకునే ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆటోల ప్రయాణిస్తున్న కూలీ సబావట్ హస్లీ(40) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు సభావట్ ఉసన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేటీఆర్ సభలో అపశృతి

● తొక్కిసలాటలో వార్డు సభ్యుడికి గాయాలు

శాయంపేట : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభలో అపశృతి చోటు చేసుకుంది. సభ ముగిశాక తిరుగు ప్రయాణం సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన రెండో వార్డు సభ్యుడు బొమ్మకంటి ఆనందం తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతున్నాడు. విషయాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా యువనేత గౌతంరెడ్డి ఆనందంను ఆస్పత్రిలో కలిసి పరామర్శించారు. ఆనందం ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు గౌతంరెడ్డి సూచించారు.

వినతిపత్రం అందజేత



కాటారం: వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరుతూ కాటారం పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు మండల కేంద్రంలో వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా తమ డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచినప్పటికీ జీఓ ఇవ్వలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు, అర్హత కల్గిన వీఆర్ఏలకు ప్రమోషన్స్, 55 సంవత్సరాలు గడిచిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు లాంటి డిమాండ్ల పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి జీఓ విడుదల అయ్యేలా చూడాలని వీఆర్ఏలు సంజయ్‌కి విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీఆర్ఏ జేఏసీ ప్రధాన కార్యదర్శి రమేశ్, కో చైర్మన్ బందెల జితేందర్, చైర్మన్ రాజయ్య, మండల అధ్యక్షుడు పట్టి లక్ష్మణ్, సతీశ్, రాకేశ్ ఉన్నారు.

అభ్యంతరాలపై దరఖాస్తులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓసీపీ ప్రాజెక్టుకు 500 మీటర్ల డేంజర్ జోన్ పరిధిలోని పెద్ద తాడిచర్లలోని ఇళ్లు, భూముల సేకరణకు పీఎన్ (ప్రాథమిక నోటిఫికేషన్)పై అభ్యంతరాలకు నిర్వాసితులు 1 704 దరఖాస్తులు సమర్పించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూమి విస్తీర్ణం, పేర్లు, పైప్‌లైన్‌లపై, ఇంటి నంబర్, విస్తీర్ణం, పేర్లు తదితర సమస్యలపై నోటిఫికేష్ వచ్చిన (డిసెంబర్14, 2022 సంవత్సరం) తేదీ నుంచి 60 రోజుల్లో నిర్వాసితులు అభ్యంతరాలపై తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల వద్ద నుంచి స్వీకరించిన దరఖాస్తులను భూపాలపల్లి ఆర్డీఓ కార్యాలయంలో సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

'హామీలను విస్మరించిన కేసీఆర్'

పరకాల: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ విస్మరించాడని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మల్లక్‌పేటలో శుక్రవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ దయ్యాల దేవరాజ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విజయ్‌చందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్‌రైతు రుణమాఫీ, దళితులకు భూపంపిణీ, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, తదితర అనేక హామీలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరావు ఉన్నారు.

ప్రతి గ్రామానికీ నీరు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

ములుగు: వచ్చే వేసవికాలంలో మండలంలోని ప్రతి మారుమూల గ్రామానికీ మిషన్ భగీరథ నీళ్లు అందించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ప్రజలు ఎక్కడా ఇబ్బంది పడకుండా చూడాలని ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎక్కడైనా పైపులైన్ సమస్యలు ఉంటే ముందస్తుగా గుర్తించి సరిచేసుకోవాలని అన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో అర్హులైన అందరికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి అద్దాలు అందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా ఉంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. జిల్లాకేంద్రంలో సీసీ రోడ్లు పనులు చేపట్టడానికి రూ.2కోట్లు మంజూరయ్యాయని అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులను గుర్తించి ప్రారంభిస్తామన్నారు. అనంతరం శాఖల వారిగా అధికారులతో మాట్లాడి అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. చేసిన పనులను నిధులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకు ముందు మాజీ ఎంపీపీ నల్లెల కుమారస్వామి మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధురకవి సత్యనారాయణస్వామి, ఎంపీడీఓ ఇక్బాల్‌వైద్యాధికారి పోరిక రవీందర్, ఏపీఓ రాజు, ఎంపీటీసీలు మాసిపెద్ది పుష్పలతసత్యనారాయణరావు, స్వామిరావు, గొర్రె సమ్మయ్య, ఈక సరస్వతి, నూనావత్ మహేశ్ నాయక్, కో ఆప్షన్ సభ్యుడు యూనుస్, సర్పంచ్‌లు మాలోత్ రవీందర్, అహ్మద్‌పాషా పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న జెడ్పీకోఆప్షన్ సభ్యురాలు వలియాబీ

ఏటూరునాగారం: కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరమని జెడ్పీకోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి కల్యాణలక్ష్మి చెక్కులు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో వధువు తల్లిదండ్రులకు ఎంతో భరోసానిస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ, ఏఆర్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత



ఎల్ఓసీ అందజేస్తున్న పుట్ట శ్రీహర్ష

పలిమెల: మండల కేంద్రానికి చెందిన కుమ్మరి హన్మంతు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో అతని చేతికి శస్త్రచికిత్స చేయాలని వైద్యులు తెలుపగా బాధితుడు బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధును సంప్రదించాడు. దీంతో స్పందించిన మధు రూ.1.25 లక్షలు ఎల్ఓసీ మంజూరు చేయించి అతడి కుమారుడు పుట్ట శ్రీహర్ష ద్వారా బాధితుడు హన్మంతు కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు. సహాయం చేసిన పుట్ట మధుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం



మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ జిల్లాకు విచ్చేసిన తరుణంలో పోలీసులు బీజేపీ, బీఎంఎస్, ఏబీవీపీ సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అర్బన్ అధ్యక్షుడు మదుసూధన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కీర్తిరెడ్డి హాజరై మాట్లాడారు. డబుల్ బెడ్ రూంల పంపిణీలో కౌన్సిలర్ల ప్రమేయంతో అవకతవకలు జరగడం వలన అర్హులు నష్టపోయారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆగడాలకు ప్రజలు త్వరలో అడ్డుకట్ట వేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చదువు రాంచెంద్రారెడ్డి, తుమ్మెటి రాంరెడ్డి, కుమార్, రాజయ్య, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహాముత్తారం: స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామంలో భాగంగా శిక్షణ కార్యక్రమం కొనసాగింది. మూడవ రోజు గ్రామపంచాయతీ సోషల్ మ్యాప్ వేసి పంచాయతీ పరిస్థితులను అంచనా వేసి వాటిపై శిక్షణ ఇచ్చారు. అదే విధంగా రెండవ రోజు చేసిన ఇంటింటి సర్వేను పంచాయతీ కార్యదర్శులు అధికారులకు సబ్మిట్ చేశారు. మరుగుదొడ్లకు సంబంధించి గ్రామాల్లో ఒక గుంత ఉన్న మరుగుదొడ్లను గుర్తించి రెండవ గుంతను కట్టించుటకు టెక్నికల్ అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమాలను జిల్లా అధికారులు మంద వెంకటేష్, చిదుముల భాస్కర్, టెక్నికల్ పర్సన్ నాగేందర్ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు వివరించారు.

ఉపాధిహామీలో కూలీల శాతం పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాణిబాయి

మహదేవపూర్: గ్రామాల్లో చేపట్టే ఉపాధిహామీ పనుల్లో కూలీల శాతాన్ని పెంచాలని ఎంపీపీ రాణిబాయి అన్నారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రతిరోజు 100 మంది కూలీలు ఉపాధిహామీ పనులలో పాల్గొనేటట్లు చూడాలని అన్నారు. ప్రస్తుతం వేసవికాలం ప్రారంభమైనందున హరితహారం కార్యక్రమంలో గతంలో నాటిన మొక్కలకు తప్పనిసరిగా గ్రామపంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా వాచర్ల సహాయంతో మొక్కలకు నీరు పట్టించాలన్నారు. నాటిన ప్రతీ మొక్క బతికేటట్లు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. హరితహారం కార్యక్రమం కింద నాటిన మొక్కలు నీరులేని కారణంగా చనిపోయినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. అర్హులకు వెంటనే కంటి అద్దాలు కూడా ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం మహదేవపూర్ గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ సెంటర్‌లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ శంకర్, ఈజీఎస్ ఏపీఓ రమేశ్, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే సీఎం కేసీఆర్ ధ్యేయం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

మొగుళ్లపల్లి: రాష్ట్రంలో ప్రజల అంధత్వ నివారణే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మొట్లుపల్లి గ్రామంలో ప్రాథమిక వైద్యాధికారిని నాగరాణి, నవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ఏకాంబ సుగుణరామారావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన అద్దాలు, శస్త్రచికిత్సలు, మందులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జోరుక సదయ్య, ఎంపీడీ కృష్ణవేణి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మంద సుధాకర్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనాలు నిర్మించాలి

చిట్యాల: జిల్లాలోని వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్ల మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏవైఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్ అధ్యక్షతన సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2014 నుంచి 2019 కాలంలో 914 గ్రామాల్లో భవనాలకు ప్రభుత్వం నిర్మాణ పనులు చేపట్టేందుకు అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఒక్కొక్క కమ్యూనిటీ హాలుకు గ్రామాల్లో రూ.7.5లక్షలు, మండలాల్లో రూ.25 లక్షలు మున్సిపాలిటీ పరిధిలో రూ.50 లక్షలు, జిల్లా కేంద్రంలో కోటి రూపాయల చొప్పున కేటాయించారని అన్నారు. నిధుల కొరతతో 20 శాతం మాత్రమే పనులు పూర్తి అయ్యాయన్నారు. అలాగే పూర్తి అయిన భవనాలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. మంజూరు గ్రామాల్లో భవనాలు మంజూరు చేసి నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం మండల నాయకులు గుర్రం రాజమౌళి, గురుకుంట్ల కిరణ్, గుర్రం తిరుపతి, కిరణ్, రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రామ్మూర్తి

ఏటూరునాగారం: సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామంలోని ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని సర్పంచ్ ఈసం రామ్మూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 9వ వార్డులో అంతర్గత రోడ్డుపై సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ సహకారంతో రూ.1.10కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇర్సవడ్ల వెంకన్న, నూతి కృష్ణమూర్తి, ముక్కెర లాలయ్య, పర్వతాల అశోక్, అబ్దుల్లా, సీరాజ్, ఖయూమ్, వార్డు సభ్యులు అశ్విని ప్రమోద్, జూనియర్ అసిస్టెంట్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

మొగుళ్లపల్లి: మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో మత్స్యశాఖ అధికారి అవినాష్ ఆధ్వర్యంలో పోతుగల్లు, ఇస్సిపేట, చింతలపల్లి, మొగుళ్లపల్లి, మెట్టుపల్లి గ్రామంలోని ముదిరాజులకు సొసైటీ సభ్యత్వాలు, వలవేయడం, ఈత కొట్టడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. వారి అభ్యున్నతికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధర్మారావు, ముదిరాజ్ సంఘం జిల్లా యూత్ కార్యదర్శి గొడుగు స్టాలిన్, ముదిరాజ్ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బియ్యం పంపిణీ



బియ్యం అందజేస్తున్న పుల్ల కోనె

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు రైస్ లవ్ నినాదంతో పుల్ల కోనె శుక్రవారం ఒకొక్కరికి 25కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ పాతపెల్లి సంతోష్ హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు పుల్ల కోనె చేపట్టిన కార్యక్రమం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. అలాగే విద్యార్థులకు మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు వాటర్ ప్లాంట్ సౌకర్యం కల్పించాలని ఎస్ఎంసీ సభ్యుడు అశోక్‌రెడ్డి కోరగా పాఠశాల ఉపాధ్యాయురాలు గ్లోరీ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అంగీకరించడంతో ఆనందం వ్యక్తం చేశారు. బియ్యం పంపిణీ చేసిన పుల్ల కోనె, వాటర్ ప్లాంట్ నిర్మాణానికి అంగీకరించిన గ్లోరిలను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలకొండ రమేష్‌బాబు, ఉప సర్పంచ్ రాజు, రుత్విక్, శ్వేత, రత్నరాజ్, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు గణేష్, శైలేంద్ర, తిరుమల, కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



బహుమతి ప్రదానం చేస్తున్న ఎల్ఐసీ అధికారులు

టేకుమట్ల(రేగొండ): విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ తామస్, పరకాల బ్రాంచ్ మేనేజర్ చిరంజీవి అన్నారు. శుక్రవారం రేగొండ మండల కేంద్రంలోని వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎల్ఐసీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు సాగాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకుని, గ్రామానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రజన్‌కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు



మట్టిని తవ్వుతున్న పొక్లెయిన్



మట్టి తరలించి ఏర్పాటు చేసిన రోడ్డు

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి వద్ద గల మేడిగడ్డ లక్ష్మిబ్యారేజ్ వెళ్లేందుకు కుదురుపల్లి నుంచి మేడిగడ్డ బ్యారేజ్ వరకు 15 కిలోమీటర్ల రెండు వరుసల రహదారి నిర్మాణం గతంలో చేపట్టారు. ఈ బ్యారేజ్‌కి సమీపంలో వివిధ గ్రామాలు, అడవిలో నుంచి చిన్నచిన్న కాల్వలు, వాగుల ద్వారా వచ్చే నీటిని బ్యారేజ్ అవతలికి తరలించుటకు 20 మీటర్ల వెడల్పుతో కాల్వను నిర్మించారు. ఈ కాల్వ తీయడంతో బ్యారేజ్ వరకు నిర్మించిన రోడ్డు 50 మీటర్లు ఆగిపోయింది. ప్రస్తుతం కాల్వకు తీసిన మట్టిని వేరే చోట తరలిస్తూ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి సూరారం రైతు వేదిక ముందు గల అసైన్డ్ భూమి నుంచి అక్రమంగా ఎర్ర మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కాగా ఈ మట్టి తీసిన గుంతల్లోనే బ్యారేజ్‌కి ఇవతలవైపు కాల్వకు తవ్విన నల్ల మట్టిని తీసుకువచ్చి పోస్తున్నారు. పలువురి అధికారుల అండదండలతో కాంట్రాక్టర్ ఇష్టం వచ్చినట్టు మట్టి తరలించి రోడ్డు నిర్మాణం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా పైఅధికారులు స్పందించి ఈ అక్రమ మట్టి తరలింపును ఆపాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

మత్స్యసొసైటీ ఎన్నికలకు 42 నామినేషన్లు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక మత్స్య పారిశ్రామిక సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్లు జారీ చేయగా 9 డైరెక్టర్ స్థానాలకు 42 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లను స్క్రూటినీ చేసినట్లు, 42 మంది బరిలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ ముగియగానే తుది జాబితాను ఎన్నికల చిహ్నాలతో సాయంత్రం 5 గంటలకు ప్రకటిస్తామని స్పష్టం చేశారు. పెద్దకోడెపాక గ్రామంలోని రైతు వేదికలో మార్చి 2న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు ఎన్నికలు జరుగుతాయని, అదే రోజు ఓట్లను లెక్కించి విజేతలను ప్రకటిస్తామని వివరించారు. ఎన్నికల నిర్వహణకు సభ్యులు సహకరించాలని కోరారు.